సాక్షి పల్నాడు

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



ఆక్రమణలు తొలగింపు

పెదకూరపాడు: పెదకూరపాడులో ఆక్రమణలు గురువారం తొలగించారు. తహసీల్దారు డానియేలు, ఎంపీడీవో రామకృష్ణ పర్యవేక్షించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,07,651 క్యూసెక్కులు వచ్చిచేరుతుంది. 1,86,018 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.



రూ.ఐదు లక్షలు విరాళం

నరసరావుపేటఈస్ట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి కృష్ణవేణి డిగ్రీ కళాశాల రూ.5లక్షలను విరాళంగా ప్రకటించింది. సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేశారు.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులకు మంత్రి గొట్టిపాటి శంకుస్థాపన



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం పువ్వాడ, ములకలూరు గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం శంకుస్థాపన చేశారు. పువ్వాడ వద్ద గుండ్లకమ్మపై రూ.20.15 కోట్లతో గోకనకొండ–పువ్వాడ మధ్య హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన, పువ్వాడలో ఇంటింటికి కొళాయి కనెక్షన్ పథకాన్ని ప్రారంభించారు. ములకలూరులో సీసీ రోడ్లు, మినీ గోకులం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏపీ పవర్ డిప్లమా ఇంజినీర్స్ నూతన కార్యవర్గం ఎంపిక



నరసరావుపేట: ఏపీ పవర్ డిప్లమా ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఇసప్పాలెంలోని కల్యాణ మండపంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పీహెచ్ ఖాన్ ఆధ్వర్యంలో నరసరావుపేట, సత్తెనపల్లి సర్కిళ్లు, నరసరావుపేట డివిజన్‌కు పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనిలో ఏపీ సీసీడీసీఎల్ జనరల్ సెక్రటరీ ఏ.గురునాధరావు, డైరీ కమిటీ చైర్మన్ నాగరాజు, స్టేట్ జాయింట్ సెక్రటరీ ఎం.ఉదయకిరణ్, గుంటూరు సర్కిల్ సెక్రటరీ జి.బ్రహ్మయ్య, అధ్యక్షులు కేవీ సుబ్బారావు హాజరయ్యారు.

గుంటూరు, పల్నాడు జిల్లాలకు కొత్త డీఈవోలు



సీవీ రేణుక - గుంటూరు (ఫైల్)



ఎల్. చంద్రకళ పల్నాడు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు, పల్నాడు జిల్లాలకు కొత్త డీఈవోలు రానున్నారు. గురువారం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జిల్లా విద్యాశాఖాధికారుల బదిలీల్లో భాగంగా గుంటూరుకు సీవీ రేణుకను నియమించింది. ఏపీ పాఠశాల విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న రేణుక గతంలో కృష్ణా జిల్లా డీఈవోగా పనిచేశారు. ప్రస్తుతం గుంటూరు డీఈవోగా ఉన్న పి. శైలజకు బదిలీల్లో భాగంగా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. బోయపాలెం మండలంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా వైజాగ్ డీఈవో ఎల్. చంద్రకళ నియమితులయ్యారు. ఆమెకు పల్నాడు డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. పల్నాడు ఇన్‌చార్జి డీఈవోగా వ్యవహరిస్తున్న ఎం.వెంకటేశ్వర్లును అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు.

యార్డులో 37,910 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 35,333 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 37,910 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,200 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,600 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 24,061 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



మురికిగా వస్తున్నాయి.

మా కాలనీలో తాగే నీరు ఎర్రగా, మురికిగా వస్తున్నాయి. ఎన్నోసార్లు అధికారులకు చెప్పాం. ఒక్కరూ మావైపు కన్నెత్తి చూడలేదు. మేము చెప్పినప్పుడే పట్టించుకుంటే ఇప్పుడు మా వాళ్లు చనిపోయేవారు కాదు. ఇప్పటికైనా మా మొర వినండి.

– బండారు పద్మ



ప్రభుత్వం వైఫల్యమే..

మా కాలనీకి తాగునీరు సరఫరా చేసే బోరు నీరు కలుషితం అవుతున్నాయని చెప్పినా పట్టించుకోలేదు. ఈ రోజు మా కాలనీలో ఇద్దరిని పోగొట్టుకున్నాం. ఇంకెంత మందిని పోగొట్టుకుంటామో తెలియదు. అధికారులు స్పందించాలి. ఇది ప్రభుత్వం, అధికారులు వైఫల్యం.

–వేముల ఆనంద్‌కుమార్



పారిశుద్ధ్యం అధ్వానం

అంజనాపురం కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. కలుషితమైన బోరుని తొలగించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి. మా కాలనీని అభివృద్ధి చేసి సురక్షిత నీరు అందిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు. సురక్షిత తాగు నీరు అందించాలి.

–బండారు వీరాంజనేయులు,



అధికారులు పట్టించుకోలేదు...

కాలనీలో వాంతులు, విరేచనాలు ప్రబలుతున్నట్లు అధికారులకు స్వయంగా ఫోన్ చేసి చెప్పినా పట్టించుకోలేదు. సకాలంలో స్పందించి ఉంటే డయేరియా అదుపులో ఉండేది. నీరు కలుషితం కావటం వలనే పరిస్థితి.

– దేవళ్ల రఘు



నా కుమార్తెని బతికించండి.

నా కుమార్తె కార్తీక వాంతులు, విరేచనాలతో బాగా నీరసించిపోయింది. నా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదు. వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో ఉన్న నా కుమార్తెకి ప్రభుత్వమే వైద్యం చేయించి బతికించాలి.

– తమ్మిశెట్టి శ్రీనివాసరావు



నా మనవడిని తెచ్చి ఇవ్వండి...

కలుషిత నీటి వల్లే నా మనవడు చనిపోయాడు. ప్రభుత్వం పట్టించుకొని ఉంటే మాకు ఈ కడుపుకోత ఉండేదికాదయ్యా..నా మనవడు వెంకటేష్‌ని నాకు తెచ్చి ఇవ్వండయ్యా.

– తమ్మిశెట్టి గురవమ్మ, అంజనాపురంకాలనీ.

ప్రాణాలు తీసున్న డయేరియా

- జిల్లాలో వరుస మరణాలు
- తాగునీరు కలుషితమే కారణం అంటున్న కలెక్టర్
- ప్రజలకు మంచి నీరు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం
- మంచం పట్టిన దాచేపల్లి అంజనాపురం కాలనీ
- ప్రభుత్వ తీరు వల్లే ఈ మరణాలంటున్న కాలనీవాసులు
- వైఎస్సార్ సీపీ హయాంలో వేసిన బోరు బావు నీటిని ఆపేసిన అధికారులు
- పాత బోరు నీటి వల్లే ఈ పరిస్థితి నెలకొందంటున్న స్థానికులు
- ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికార యంత్రాంగం
- గాలికి వదిలేసిన పారిశుద్ధ్య నిర్వహణ

పట్టించుకోని ప్రభుత్వం



డయేరియా బాధితుడు నాగరాజుకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

దాచేపల్లి : కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత తాగునీరు, పారిశుద్ధ్యం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దాచేపల్లి అంజనాపురం కాలనీలో వాంతులు, విరేచనాలతో ప్రజలు మంచం పడుతున్నారు. డయేరియాతో ఇద్దరు మృతి చెందగా మరో 14 మంది చికిత్స పొందుతున్నారు. కాలనీలో నివాసం ఉంటున్న బండారు చిన్న వీరయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ డయేరియా బారిన పడి మృత్యువాతపడ్డారు. 14 మంది బాధితుల్లో కార్తీక, శాంతమ్మ, దుర్గారావు, సైదారావుల ఆరోగ్య పరిస్థితి కొంత ఇబ్బందికరంగానే ఉన్నది. ఎప్పుడు ఎటువంటి వార్త వినాల్సి వస్తుందో అని కాలనీ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారు.

కాలనీలో పడకేసిన పారిశుద్ధ్యం

అంజనాపురం కాలనీలో పారిశుద్ధ్యం పడకేసింది. పేరుకే నగర పంచాయతీలో ఈ కాలనీ ఉన్న ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఈ కాలనీలో వీధులు బురదమయంగా ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటం వలన మురుగు రోడ్లపైనే పారుతోంది. కాలనీ ప్రజలకు తాగునీరు అందించే పైపులైన్లు మురికి కుపాల్లోనే ఉన్నాయి. తాగునీటి బోరులోకి మురుగు నీరు, సెప్టిక్ ట్యాంక్‌లోని నీరు చేరటం వలన కలుషితం అవుతున్నాయి. దీంతో ప్రజలు వాంతులు, విరేచనాల బారినపడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన బోరుకున్న పైపులైన్లను తొలగించి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కలుషితం అవుతున్న బోరుకి కనెక్షన్ ఇచ్చినట్లుగా కాలనీవాసులు చెబుతున్నారు. ఈ బోరు నుంచి వచ్చే నీరు తాగటం వలనే మాకు ఈ పరిస్థితి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అంజనాపురం కాలనీలో బురదమయంగా ఉన్న వీధి



డయేరియాకు కారణమైన బోరు



అంజనాపురం కాలనీలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరం

ప్రభుత్వం బాధ్యత వహించాలి



మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: డయేరియా మరణాలకు ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే యరపతినేని బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో డయేరియాతో ఇద్దరు మృతి చెందటం పట్ల విచారం వ్యక్తం చేశారు. కలుషిత నీరు తాగటం వలనే ఇద్దరు చనిపోయారని, ప్రజలకు సురక్షిత నీరు అందించలేకపోవటం చూస్తుంటే ప్రభుత్వం దుస్థితి అర్థమౌతుందని అన్నారు.మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పిడుగురాళ్లకు శుద్ధి చేసిన కృష్ణానీటిని అందించామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కృష్ణానది నీటిని అందించలేక బోరు నీటిని అందించటం వలన ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారని చెప్పారు. మృతుల కుటుంబసభ్యులు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, అయ్యప్పమాల తీసిన తరువాత బాధిత కుటుంబాలను పరామర్శిస్తామని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

దాచేపల్లి: డయేరియా బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. బాధితులు, కాలనీవాసులతో మాట్లాడారు. కాలనీలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం పరిశీలించారు. కాలనీలో నీటి నమూనాలు సేకరించి విజయవాడ ల్యాబ్‌కి పంపించి పరీక్ష చేయించాలని, అప్పటి వరకు స్థానికంగా ఉన్న నీటిని వాడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలనీవాసులకు సురక్షిత నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, పారిశుద్ధ్య పనులు మెరుగుపరచి డయేరియా కేసులు అదుపులోకి వచ్చేంత వరకు వైద్యశిబిరాలు కొనసాగించాలని చెప్పారు. అవసరమైతే ఇతర పీహెచ్‌సీల నుంచి సిబ్బందిని రప్పించాలని డీఎంహెచ్‌వో రవిని ఆదేశించారు.

నరసరావుపేట కేంద్రంగా శిశు విక్రయాలు

- కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు
- రంగంలోకి దిగిన పోలీసులు
- అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు
- అదుపులో అనుమానితులు
- నాలుగు శిశు విక్రయాలు జరిగినట్టు నిర్ధారణ

నరసరావుపేట టౌన్/ఈస్ట్: పల్నాడు జిల్లా నరసరావుపేట కేంద్రంగా శిశు విక్రయాల రాకెట్ వెలుగులోకి వచ్చింది. గత కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా ముక్కుపచ్చలారని పసికందులను దళారులు విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలియవచ్చింది. ఈవ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందినట్లు సమాచారం. దీనిపై స్పందించిన కలెక్టర్ తదుపరి విచారణ చేపట్టాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించినట్టు తెలిసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గతంలో స్టేషన్ రోడ్డులోని ప్రముఖ ప్రైవేటు వైద్యశాలలో ఆయాగా పనిచేసిన మహిళ ఈ శిశు విక్రయాలలో కీలకపాత్ర పోషించినట్టు తెలుసుకున్న ఆమెను అదుపులోకి తీసుకొని మహిళా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణలో నలుగురు శిశువులను తాను మధ్యవర్తిత్వం చేసి విక్రయించినట్లు అంగీకరించినట్టు తెలిసింది. ఆమె ఇచ్చిన సమాచారంతో విక్రయానికి గురైన చిన్నారిని గుర్తించారు. సదరు చిన్నారిని శిశు సంక్షేమశాఖాధికారులకు అప్పగించినట్టు సమాచారం. చిన్నారిని కొనుగోలు చేసిన వారిని విచారించారు. బిడ్డను విక్రయించిన తల్లిదండ్రులను విచారించగా తమ ఆర్థిక పరిస్థితి బాగోలేక పాపను ఇచ్చినట్టు అంగీకరించినట్టు తెలియవచ్చింది. విక్రయానికి గురైన మరో బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ఎంతో కాలంగా...

పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నరసరావుపేట కేంద్రంగా శిశు విక్రయాలు ఎంతో కాలంగా కొనసాగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. గతంలో విక్రయానికి గురైన బాలుడి వయస్సు ప్రస్తుతం 16 సంవత్సరాలు ఉండటంతో ఈ అక్రమ విక్రయాలు ఎప్పటినుండో జరుగుతున్నట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. విచారణ ఎదుర్కొంటున్న సదరు ఆయా బంధువులకు పిల్లలు లేకపోవటంతో అప్పట్లోనే సదరు బాలుడి వ్యవహారంలో ఆమె మధ్యవర్తిత్వం చేసినట్టుగా గుర్తించారు. ఆసుపత్రికి కాన్పుల నిమిత్తం వచ్చే పేదలను గుర్తించి వారి ఆర్థిక పరిస్థితులు, కుటుంబ నేపథ్యాలను తెలుసుకొని ప్రలోభాలకు గురిచేసి వారి పిల్లలను విక్రయించేలా ప్రోత్సహించినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. ప్రస్తుతం వైద్యశాల డాక్టర్ మృతిచెందటంతో వైద్యశాలను మూసివేశారు. శిశు విక్రయాలపై మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుభాషిణిని వివరణ కోరగా విచారణ జరుపుతున్నామని తెలిపారు. వివరాలు తెలిపేందుకు నిరాకరించారు.

డీఆర్వో వినాయకం బదిలీ

నూతన డీఆర్వోగా మురళి నియామకం



వినాయకం

నరసరావుపేట: పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏపీఎంఎస్ఐడీసీలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఏక మురళి నియమితులయ్యారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన డీఆర్వోల బదిలీల ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. వినాయకంకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా పొలిటికల్ జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. కాగా, వినాయకం రెండేళ్ల నుంచి డీఆర్వోగా పనిచేస్తూ సమర్థుడైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. రెవెన్యూ విభాగ పరిధిలో కలెక్టరేట్ వద్ద పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుచేసి సమర్థవంతంగా నిర్వహించారు.

అనుమతుల్లేని ప్రయాణం

యథేచ్ఛగా బల్లకట్టు నిర్వహణ

- అక్రమంగా జిప్సం, సున్నపురాయి సరఫరా
- నిబంధనలకు విరుద్ధంగా అధిక చార్జీలు వసూలు
- పలుమార్లు వేలం నోటీసు ప్రకటించినా స్పందన కరువు
- జెడ్పీ ఆదాయానికి గండి కొడుతున్న దళారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గోవిందాపురం బల్లకట్టు వద్ద లారీలను దాటిస్తున్న దృశ్యం

మాచవరం: కృష్ణా నదిలో బల్లకట్టు నిర్వహణకు అనుమతులు లేవు. అయినా యథేచ్ఛగా సాగుతోంది. అనేక వస్తువులను అక్రమంగా రవాణా చేస్తున్నారు. అంతేగాకుండా ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

మాచవరం మండలం గోవిందాపురం వద్ద కృష్ణానదిలో బల్లకట్టు నిర్వహణకు జెడ్పీ కార్యాలయం పలుసార్లు టెండర్లు పిలిచింది. అందరూ సిండికేట్ కావడంతో పలుమార్లు వాయిదా పడింది. తగిన ధరావత్తు చెల్లించి బల్లకట్టు నిర్వహించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఎవరూ ముందుకు రాకపోవడంతో జిల్లా పరిషత్ అక్కడ బల్లకట్టు నిర్వహణకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కానీ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బల్లకట్టు నిర్వహిస్తున్నారు. ఈ మార్గం అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. జిల్లాతోపాటు, ఇతర జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి ఈ బల్లకట్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి జిప్సం, సున్నపురాయి, బొగ్గు, గ్రానైట్ రాయి, బియ్యం, నల్లమట్టి, క్రషర్ పౌడర్ మొదలైనవి రవాణా అవుతుంటాయి. అద్దంకి–నార్కట్‌పల్లి హైవేలో దాచేపల్లి మండలం పొందుగల వద్ద అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు ఉన్నాయి. అక్కడ తనిఖీలు నిర్వహిస్తారని తెలిసి వ్యాపారులు ఈ బల్లకట్టు ద్వారా సరుకును దాటవేసున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఉప్పుడు బియ్యం, జిప్సం, సిమెంట్, మిరప, పత్తి రవాణా చేస్తున్నారు. పిడుగురాళ్ల హైవే దగ్గరగా ఉండడం, సరిహద్దు ప్రాంతాన ఎలాంటి చెక్ పోస్టులు లేకపోవడం, మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించడంతో రవాణా యథేచ్ఛగా సాగుతుంది.

అధిక చార్జీలు..

నిబంధనలకు విరుద్ధంగా బల్లకట్టు గుత్తేదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. కృష్ణానదికి ఇరువైపుల (చింతిర్యాల, గోవిందాపురం రెండు రేవులు) బల్లకట్టు నిర్వాహకులు సిండికేట్ కావడంతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు.

చార్జీల వసూలు ఇలా...

	నిబంధనల ప్రకారం	వసూలు చేస్తున్నది
ఒక్కో మనిషికి 40 కిలోల లగేజితో..	రూ.3	రూ.50
ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో కలిపి	రూ.15	రూ.100
ఆటో	రూ.180	రూ.400
కారు	రూ.180	రూ.500
లారీ	రూ.240	రూ.1000
ట్రాలీతో కూడిన ట్రాక్టర్	రూ.180	రూ.500

అనుమతులు లేకుంటే చర్యలు

గోవిందాపురం బల్లకట్టు నిర్వహణకు అనుమతులు లేవు. ఇప్పటికే జిల్లా పరిషత్ ద్వారా పలుసార్లు వేలం నోటీసులు ప్రకటించాం. అనుమతులు లేకుండా బల్లకట్టు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

– ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు.

పాత నేరస్తుల కదలికలపై నిఘా

● జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు
● జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష

నరసరావుపేట: జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పాత నేరస్తులపై నిత్యం నిఘా ఉంచాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ప్రతిరోజు రైడ్‌లు నిర్వహిస్తూ పూర్తిస్థాయిలో కట్టడి చేస్తే నేరాలు తగ్గే అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో నేరసమీక్ష నిర్వహించారు. గతంలో నాటుసారా సంబంధిత కేసుల్లో బైండోవర్ చేసిన వ్యక్తులు మళ్లీ పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసులు, మహిళలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ, మిస్సింగ్ కేసుల దర్యాప్తు త్వరగా పూర్తిచేయటంతోపాటు అటువంటి నేరాలు జరగకుండా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. మహిళలు, బాలికలు, చిన్నారులపై ఫిర్యాదులు అందిన వెంటనే ప్రతిస్పందించి తగు చర్యలు తీసుకోవాలని, వారికి సంబంధించిన కేసుల విచారణ సమయంలో తప్పనిసరిగా మహిళా పోలీస్ అధికారి, సిబ్బంది ఉండేట్లుగా చూసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 112 ఎమర్జెన్సీ నెంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రౌడీలు, అనుమానితులు, పాత నేరస్తుల కదలికలపై ఎల్లప్పుడూ నిఘా ఉంచాలన్నారు. విచారణ దశలో వున్న కేసులను సాంకేతిక పరిజ్ఞానం, వృత్తినైపుణ్యాన్ని ఉపయోగించి వేగవంతంగా దర్యాప్తుచేసి సంబంధిత కోర్టులో ఛార్జిషీట్ వేయాలన్నారు. కోర్టులో విచారణ సక్రమంగా జరిగేవిధంగా సంబంధిత డీఎస్పీ, సీఐ, ఎస్‌హెచ్‌ఓలు స్వయంగా పర్యవేక్షించాలన్నారు.


నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీలు సంతోష్, లక్ష్మీపతి


ప్రతిభ కనబర్చిన సిబ్బందికి రివార్డులు అందజేస్తున్న ఎస్పీ, అదనపు ఎస్పీలు

ప్రతిభ చూపిన అధికారులకు రివార్డులు...

జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మాచర్ల టౌన్ సీఐ పి.ప్రభాకర్, కారంపూడి, చిలకలూరిపేట రూరల్, సత్తెనపల్లి, నరసరావుపేట టుటౌన్ సీఐలు టీవీ శ్రీనివాసరావు, బి.సుబ్బానాయుడు, బి.బ్రహ్మయ్య, ఎం.హైమారావు, నాగార్జునసాగర్, చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐలు షేక్ ఎండీ షఫీ, జి.అనిల్‌కుమార్, సిబ్బందికి రివార్డులు అందజేశారు. అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, అదనపు క్రైం ఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి గారు, నరసరావుపేట, సత్తెనపల్లి డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు పాల్గొన్నారు.

పోలీసులకు వైద్యసహాయంపై ప్రత్యేక శ్రద్ధ

నరసరావుపేట: జిల్లాలో యాభై ఏళ్ల దాటిన పోలీసు సిబ్బందిపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని గుండెకు సంబంధించిన అన్ని వైద్య పరీక్షలు, మహిళా సిబ్బందికి క్యాన్సర్ పరీక్షలు స్త్రీ వైద్య నిపుణులతో చేయించుకొనే విధంగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపు (వైద్య శిబిరాన్ని) రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో పోలీసులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటారని, దానిని దృష్టిలో పెట్టుకొని ఈ మెడికల్ క్యాంపు తలపెట్టామన్నారు. వైద్య శిబిరానికి డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సి విజన్ డాక్టర్ చెంచిరెడ్డి, రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ అనిరుద్ ఫణిభార్గవ్, దత్త సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కృష్ణకాంత్, పి.మహేష్‌లతో పోలీసులకు అందజేసే వైద్యంపై చర్చించారు. అనంతరం ఆయా విభాగాలలో వైద్యులు వైద్యపరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు.

పులిచింతలకు 1,88,220 క్యూసెక్కులు విడుదల

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు ద్వారా 1,88,220 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ జయపాల్ గురువారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 12 క్రస్ట్‌గేట్లు 3 మీటర్లు ఎత్తు ఎత్తి 1,88,220 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న కృష్ణానదికి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో నున్న రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 75.50 మీటర్లకు గాను 75.39 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకు గాను ప్రస్తుతం 7.004 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 59.72 మీటర్లకు చేరుకుందన్నారు. నాగార్జునసాగర్ నుంచి 1,90,826 క్యూసెక్కుల వరదనీరు టెయిల్‌పాండ్ రిజర్వాయర్‌కు వస్తుందన్నారు.


నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్లు ద్వారా పులిచింతల ప్రాజెక్టుకు వదిలిన వరదనీరు

విధుల నుంచి తొలగించడం అన్యాయం

దాచేపల్లి: డ్వాక్రా విధుల నుంచి యానిమేటర్లను తొలగించటం అన్యాయమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు అన్నారు. దాచేపల్లి మండలవ్యాప్తంగా 18 మంది యానిమేటర్లను కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తొలగించారు. వీరిని తొలగించటాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. మసీద్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఏపీఎం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఏపీఎం రవికుమార్‌కి వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకి కూడా వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే యరపతినేని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా యానిమేటర్లుగా పనిచేస్తున్న 18 మందిని అక్రమంగా తొలగించారని, వీరిని తక్షణమే విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యానిమేటర్లు పాల్గొన్నారు.


దాచేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న యానిమేటర్లు

అండర్-19 మ్యాచ్‌లో 'గ్రూప్-ఏ' ఘనవిజయం

171 పరుగుల లక్ష్యసాధనలో తడబడ్డ గ్రూప్-బి జట్టు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ అండర్-19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్‌ల్లో భాగంగా నిర్వహించిన తొలి మ్యాచ్‌లో గ్రూప్-ఏ జట్టు 79 పరుగుల తేడాతో గ్రూప్-బి జట్టుపై ఘనవిజయం నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 76 పరుగులతో వెనుకబడ్డ గ్రూప్-ఏ జట్టు రెండవ ఇన్నింగ్‌లో 246 పరుగులు సాధించింది. దీంతో 171 పరుగుల విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన గ్రూప్-బి జట్టును 91 పరుగులకే ఆలౌట్ చేసి గ్రూప్-ఏ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసుకొంది. నిన్నటి ఓవర్‌నైట్ స్కోర్ ఒక వికెట్ నష్టానికి 14 పరుగులతో గురువారం బ్యాటింగ్ ప్రారంభించిన గ్రూప్-బి జట్టు 91 పరుగులకు ఆలౌట్ అయింది. విజయం సాధించిన గ్రూప్-ఏ జట్టుకు 6 పాయింట్లు లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

● సాక్షి కథనంపై డీసీహెచ్‌ఎస్ విచారణ
● వైద్యసేవల్లో అలసత్వంపై ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్

నరసరావుపేటటౌన్: వైద్య సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ ఆఫ్ హాస్పటల్ సర్వీసెస్ (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ బీవీ రంగారావు హెచ్చరించారు. కిడ్నాప్‌కు గురైన మైనర్ బాలికకు చికిత్స అందించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైనంపై 'డాక్టర్ లేరు.. వైద్య పరికరాలు లేవంట!' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై డీసీహెచ్‌ఎస్ స్థానిక ఏరియా వైద్యశాలలో విచారణ జరిపించారు. బాధితురాలు మంగళవారం అర్ధరాత్రి వైద్యశాలకు వచ్చిన సమయంలో విధుల్లో ఉన్న డాక్టర్, సిబ్బందిని విచారించారు. బాధితురాలికి ఆలస్యంగా వైద్య సేవలు అందించటంపై ప్రశ్నించారు. అదేవిధంగా మందులు తమ వద్ద అందుబాటులో లేవని బయట మెడికల్ దుకాణంలో కొనుగోలు చేసి తెచ్చుకోవాలని చెప్పిన అంశంపై ఆరా తీశారు. సంఘటనపై సమగ్ర విచారణ జరిపి వైద్యసేవలు అందించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని డాక్టర్ బీవీ రంగారావు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్, సిబ్బంది ఉన్నారు.


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, పక్కన డాక్టర్ మంత్రునాయక్

మద్యం దుకాణంపై అభ్యంతరం

రాజుపాలెం: మండలకేంద్రంలోని రాజుపాలెం గ్రామంలో నివాసాల నడుమ మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మహిళలు, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణానికి ఇరువైపుల నివాసాలు ఉన్నాయని, కూతవేటు దూరంలో పాఠశాలకూడా ఉందని, ఉదయం, సాయంత్రం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయినులు ఆ దుకాణం ముందునుంచే వెళ్లాలని ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వెంటనే అక్కడినుంచి దుకాణం తొలగించాలని కోరుతున్నారు. మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి మార్చాలని పాఠశాల యాజమాన్యం ఇప్పటికే దుకాణం లైసెన్సు దారులకు చెప్పినట్లు తెలుస్తోంది. మద్యం దుకాణం విషయమై పులిచింతల నిర్వాసితులు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలని కోరుతున్నారు.

వర్సిటీ కబడ్డీ విజేత కృష్ణవేణి కళాశాల

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు ప్రథమ స్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు గురువారం తెలిపారు. ఈనెల 21 నుంచి 23వతేదీ వరకు విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలలో తమ కళాశాల జట్టు ప్రథమ స్థానం సాధించటంతోపాటు తమ విద్యార్థులు వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. తమ విద్యార్థులు బి.నాగఫణీంద్ర, జె.అంకాలు, బి.అజయ్‌కుమార్, బి.విజయకుమార్ వర్సిటీ జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 30 నుంచి నవంబర్ 3వతేది వరకు తమిళనాడులోని ఎస్ఆర్ఎం వర్సిటీలో జరగనున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలలో తమ విద్యార్థులు ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కె సతీష్‌బాబు ఎం.తిరుపతిరావు అభినందించారు.


వర్సిటీ కబడ్డీ విజేతలతో కళాశాల ప్రిన్సిపాల్ నాతాని, పీడీ ఆదిబాబు

వృద్ధ దంపతులపై దాడికేసు.. నిందితులు అరెస్ట్

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): సత్తెనపల్లి పట్టణంలోని వృద్ధ దంపతులపై దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతురావు తెలిపారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండల కేంద్రానికి చెందిన సత్తి గవనకుమార్‌రెడ్డి గత కొంతకాలంగా పట్టణంలో వడ్డీ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గడిచిన ఎన్నికల్లో రూ.20లక్షలు బెట్టింగ్‌తో పాటుగా వడ్డీ వ్యాపారంలో మరో రూ.20లక్షలు పోగొట్టుకున్నాడు. పోయిన సొమ్మును రాబట్టుకునేందుకు స్నేహితులైన సత్తెనపల్లి మండలంలోని భట్లూరు గ్రామానికి చెందిన మర్రి అమ్మయ్య, ఎర్రసాని నానితో పథకం పన్నాడు. ఆ మేర ముగ్గురు పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో టూలెట్ బోర్డు పెట్టి ఉన్న తూనుగుంట్ల సీతారామయ్య గృహంలో ఈ నెల 22వ తేదీ ఉదయం ప్రవేశించి, అద్దెకు ఇల్లు కావాలని కోరారు. ఇల్లు చూపించే క్రమంలో వృద్ధ దంపతులపై వారు దాడికి పాల్పడ్డారు. అంతే కాకుండా నగదు కావాలని, లేకుంటే బంగారు వస్తువులైన ఇవ్వాలంటూ బెదిరిస్తూ దాడికి పాల్పడ్డారు. భయభ్రాంతులకు గురైన దంపతులు పెద్దగా కేకలు వేయటంతో తమ వెంట తీసుకువచ్చిన బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. బాధితుడు సీతారామయ్య ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వారు ఉపయోగించిన బైక్, కర్ఛీఫ్, కారం ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. నిందితులు సత్తి గవనకుమార్‌రెడ్డి, మర్రి అమ్మయ్యలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. మూడో నిందితుడు ఎర్రసాని నాని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కేసును 48 గంటల్లో ఛేదించి, నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పట్టణ సీఐ బ్రహ్మయ్య, ఎస్‌ఐలు ఎన్.సంధ్య, పవన్, ఏఎస్‌ఐ పి.సుబ్బారావు, నర్రా శంకర్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. కేసును ఛేదించటంలో పోలీసులు చూపిన చొరవను అభినందిస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు చేతుల మీదుగా రివార్డ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతురావు

ఎస్‌జీఎఫ్ ఉమ్మడి గుంటూరు ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడల ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లు ఎంపిక పోటీల వివరాలను గురువారం స్కూల్ గేమ్స్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ప్రకటించారు. పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఆయా క్రీడల సమయంలో ఉదయం 9 గంటలకు తగిన సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

తేదీ	క్రీడలు	విభాగం	ప్రదేశం
అక్టోబర్ 25	కబడ్డీ	అండర్-17(బాలురు)	జడ్పీ హైస్కూల్, చినకాకాని
"	యోగా	అండర్-17 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, రావెల
అక్టోబర్ 26	యోగా	అండర్-14 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్. పెనుమాక
"	బాల్ బాడ్మింటన్	అండర్-14, అండర్-17 (బాలురు)	జడ్పీ హైస్కూల్, పసుమర్రు
"	స్విమ్మింగ్	అండర్-14, అండర్-17 (బాల బాలికలు)	ఎస్ఎస్అండ్ఎన్ కళాశాల, నరసరావుపేట
అక్టోబర్ 28	అథ్లెటిక్స్	అండర్-14 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, సిరిపురం
"	ఖోఖో	అండర్-17 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, నకరికల్లు
అక్టోబర్ 29	బాల్ బాడ్మింటన్	అండర్-14, అండర్-17 (బాలికలు)	జడ్పీ హైస్కూల్, శావల్యాపురం
అక్టోబర్ 30	సాఫ్ట్‌బాల్	అండర్-17 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, రావెల

పత్తి మొక్కలను పెరికివేసిన రైతు


మొక్కలను పెరికివేసి కుప్పలుగా వేసిన రైతు


మొక్కలను తగలబెడుతున్న వైనం

పత్తికాయలకు పురుగు పట్టడమే కారణం

పిడుగురాళ్ల: ఆరుగాలం శ్రమించి, అప్పు చేసి పత్తి పంటను పండించిన రైతుకు నష్టాలు ఎదురయ్యాయి. తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పత్తి పంటకు పురుగు సోకి దిగుబడి లేకపోవటంతో రైతులు పత్తి మొక్కలను పీకేస్తున్నారు. మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు సుమారు రెండున్నర ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఆశించిన మేర దిగుబడి రాలేదు. మొక్కలు ఏపుగా పెరిగి కాయలు ఉన్నప్పటికీ ఆ కాయకు నల్లపురుగు రావటంతో చెట్టుకున్న కాయలన్నీ విచ్చుకోకుండా పాడైపోతున్నాయి. గమనించిన రైతు పురుగు మందు పిచికారీ చేసినప్పటికీ ఫలితం లేకపోవటంతో పంటను పూర్తిగా పీకేశారు. పీకేసిన పత్తి చెట్లు ఉండిపోవటంతో గురువారం వాటికి నిప్పు అంటించారు. పత్తి పంటలో నష్టం పూడ్చేందుకు అంతరపంటలైన మినుపు వంటి పంటలు వేస్తామని రైతు చెబుతున్నారు.

నేటి నుంచి పశు గణన సర్వే

జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి కంచర్ల కాంతారావు

శావల్యాపురం: జాతీయ స్థాయిలో ప్రారంభం కానున్న పశు గణన సర్వే కార్యక్రమంలో ప్రజలందరు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని పల్నాడు జిల్లా పశు సంవర్థకశాఖాధికారి కంచర్ల కాంతారావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొత్తలూరు, శానంపూడి, కనమర్లపూడి తదితర గ్రామాల్లో జీవాల్లో సాముహిక నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఆయన స్థానిక పశువైద్యశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతి ఐదు సంవత్సరాల కొకసారి పశుగణాంకాల సర్వే కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో నాలుగు నెలల పాటు సర్వే జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 298 మంది ఎన్యూమేటర్లకు శిక్షణ ఇచ్చామని 23 రకాల జాతులను సర్వే చేస్తారన్నారు. పశు గణాంకాల సర్వే చేసిన సమగ్ర వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు ఎన్యూమేటర్ల చేస్తారన్నారు. సర్వే పారదర్శకంగా జరిగేలా మండలస్థాయిలో పశు వైద్యాధికారులు నిరంతరం ఎన్యూమేటర్లపై పర్యవేక్షణ చేస్తారన్నారు. గోకులం షెడ్ల నిర్మాణ పనుల్లో పశువైద్యాధికారులు యూనిట్స్ పనితీరుపై అవగాహన కల్గియుండాలన్నారు. జిల్లాలో పశువైద్యశాలల్లో మందుల కొరత ఉందన్నారు. ఆయనతో పాటు పశువైద్యాధికారులు సోముల గుణదీర్, పాలపర్తి గణేష్‌కుమార్, పశువైద్య సిబ్బంది బి.మేఘన, బలరామ్, అబ్రహాం, బుల్లెయ్య తదితరులు పాల్గొన్నారు.


కనమర్లపూడిలో జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న కాంతారావు

ఆరుతడుల పద్ధతిలో అధిక దిగుబడులు

నరసరావుపేట రూరల్: వరిలో ఆరుతడుల వ్యవసాయం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని డాట్ సెంటర్ శాస్త్రవేత్త నగేష్ తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు శిక్షణా కార్యక్రమం మండలంలోని పెదరెడ్డిపాలెంలో గురువారం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, డాట్ సెంటర్ శాస్త్రవేత్త నగేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ పత్తిలో గులాబీరంగు పురుగు ఉనికిని గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటుచేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వరిలో సస్యరక్షణ, చీడపీడల నివారణ పద్ధతులను తెలియజేశారు. ఆకుచుట్టు పురుగు, సుడిదోమ వరిలో వచ్చే అవకాశం ఉందని వీటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మెలైన యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు. బయో ఫెర్టిలైజర్స్ ఉపయోగాలు, వాటి వినియోగంపై డీడీఏ శివకుమారి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ పరిధిలోని ఏఓలు, వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాట్ సెంటర్ శాస్త్రవేత్త నగేష్

ముగ్గురు విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్

● షిప్ట్ ఆపరేటర్ విధుల నుంచి తొలగింపు
● విద్యుత్ శాఖ ఏఈ రాంబొట్లు

మాచర్ల: నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాలలో సిబ్బంది పనితీరుపై కొన్ని రోజులుగా పరిశీలన చేస్తున్న నేపథ్యంలో కారంపూడి మండలంలోని నలుగురు విద్యుత్ శాఖ ఉద్యోగులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వైనం వెలుగులోకి వచ్చిందని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబొట్లు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ శాఖలో నిర్లక్ష్యంగా పనిచేస్తూ కార్యాలయంలోనే మద్యం సేవిస్తూ, అసాంఘిక చర్యలకు పాల్పడుతూ సోషల్ మీడియాలో వైరల్ అయిన నలుగురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. కారంపూడి సెక్షన్‌లో గాదెవారిపల్లె సబ్ స్టేషన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్ ఒ.నాగరాజు, అసిస్టెంట్ లైన్‌మెన్ ఎస్.చెన్నకేశవరావు, పరబ్రహ్మచారిలు విద్యుత్ కార్యాలయంలో మద్యం సేవిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయిందన్నారు. దీనిపై ప్రాథమిక విచారణ చేసి వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. వీరితో కలిసి మద్యం సేవించిన షిఫ్టు ఆపరేటర్ జి.శ్రీనివాసరావును విధుల నుంచి తొలగించామన్నారు.


మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ రాంబొట్లు

సింగుపాలెంలో కేంద్ర బృందం పర్యటన

రేపల్లె రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సింగుపాలెం గ్రామంలో జరిగిన వివిధ రకాల అభివృద్ధి పనులను గురువారం కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీరోడ్లు, పంచాయతీ భవనం, కాల్వలపూడికతీత, కాల్వ గట్లు, డొంకరోడ్ల అభివృద్ధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. గ్రామంలో అమలవుతున్న పింఛన్ పథకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డ్వామ ఏపీడీ చంద్ర సువార్త, ఎంపీడీవో ఎం.శోభారాణి, ఈవోపీఆర్డీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.